**నీలగిరి నిత్యపద్యం**

**ఆటవెలది**

విత్తు వలెను నుండు చిత్తమ్ముసైతము
నాటినట్టు పెరుగు మేటిగాను
మంచి భావనమ్ము పెంచును మనకును
విలువనిచ్చి నిలుపు విశ్వమందు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్)
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక 11 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | జూలై 10, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్

# ఆర్థిక వ్యవస్థ





- దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు
- తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు
- హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు
- ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,జూలై 09:**

2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగు తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో మిగతా2లో...

### కళాకారుల ఆరోగ్యం, సంక్షేమం కూడా

# ముఖ్యమే...

- కళాకారులతో మాట్లాడినప్పుడు వారి ఆరోగ్య సమస్యలు గుర్తించా...
- అందుకే వారి ఆరోగ్యం కోసం ఉచిత వైద్య చికిత్స ఏర్పాటు చేశా...
- ఎక్స్ వేదికగా డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వెల్లడి




**అమరావతి, జూలై 09:** సంప్రదాయ కళలను పరిరక్షించడం అంటే వాటిని ప్రోత్సహించడం మాత్రమే కాదని, వాటిని జీవనాధారంగా చేసుకున్న కళాకారుల ఆరోగ్యం, సంక్షేమాన్ని కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో మాట్లాడిన సమయంలో వారు ఎదుర్కొంటున్న వృత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు తన దృష్టికి మిగతా2లో...

### ధాన్యం కొనుగోలులో

# రికార్డు




2లో

- వినూత్న సంస్కరణలతో రైతులకు మేలు
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

### హరీష్ రావుపై కెసిఆర్‌కు

# నమ్మకం లేదు

- అందుకే మంత్రి పదవికి దూరం పెట్టారు
- ఎల్‌నినోపై కార్యాచరణ చేపడతున్నాం
- సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,జూలై 09 :** ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్‌రావుకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మిగతా2లో...

# బిఆర్ఎస్ ఖాతాలోని 1400 కోట్లు పంచాలి

- అమరలు కుటుంబాలకు పంచి నిజాయితీ చాటాలి
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్



**భద్రాద్రికొత్తగూడెం,జూలై 09 :** బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ.1,400 కోట్లు అమరుల కుటుంబాలకు పంచాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆ డబ్బు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చింది కాదా?అని ప్రశ్నించారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా మిగతా2లో...

# బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

### సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో కెసిఆర్ నిర్ణయం




**హైదరాబాద్,జూలై 09:**

రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లోర్ లీడర్‌గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు గా, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ముగియడంతో మిగతా2లో...

## కాంగ్రెస్ పార్టీ పని ఇక అయిపోయినట్టేనని రేవంత్ రెడ్డి సొంత సర్వేలోనే తేలింది : కేటీఆర్



**హైదరాబాద్,జూలై 09 :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని ఇక అయిపోయినట్లే అని.. ఇదే అంశం రేవంత్ రెడ్డి చేయించుకున్న సొంత సర్వేలోనూ తేలిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన పరిపాలనపైన, తన నాయకత్వంపైన, సగం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఒక విస్తృత సర్వేను చేయించుకున్నారని, అందులోనూ ప్రజా వ్యతిరేకత చాలా స్పష్టంగా వ్యక్తమైందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో జరిగిన ఈ సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, ఎస్ఐఆర్ కమిటీ నేతలు హాజరయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఎస్ఐఆర్‌పై ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, అలాగే పార్టీ పరంగా చేయాల్సిన సూచనలపై ఈ సందర్భంగా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మిగతా2లో...

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

- దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం 2లో

### స్పీకర్, మండలి చైర్మన్‌తో

# సిఎస్ భేటీ



2లో

### ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా

# కాంగ్రెస్ పంచాయితీ

కొండా వర్సెస్, కడియం అన్నట్లుగా పరిస్థితులు
మంత్రి పనితీరుపై కాంగ్రెస్ నేతలల్లో అసంతృప్తి 2లో

RNI - TELTEL/2023/87644

# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ. ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరమని సీఎం అభిప్రాయ పడ్డారు. యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్న సీఎం.. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు నిర్మించి అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు చేసిన త్యాగాల వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని సీఎం కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సీతారాంపూర్‌లో నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి త్వరలో మరోసారి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల సహకారంతో తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# వ్యవసాయ రంగానికి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాధపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా రైతు మేళాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, జిల్లా కలెక్టర్ దివాకరతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించడమే ఈ మెగా రైతు మేళా ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.మెగా రైతు మేళా ప్రాంగణంలోనే శుక్రవారం మధ్యాహ్నం రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ అభివృద్ధి చర్యలపై సీఎం రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ, కడెం వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ బలంగా ఉన్నాయని, బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టుల పరిస్థితి రాష్ట్ర ప్రజలకు తెలిసిందేనని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాకు గత ప్రభుత్వాలు తగిన నీటి వనరులు అందించలేదని, ఆ విషయాన్ని చరిత్రతో సహా నిరూపిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రజలను మాటలతో మోసం చేసే పార్టీ అని, 2023 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలు జిల్లాల పర్యటనలు చేస్తూ విమర్శలు చేస్తున్నప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతోందని, రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటలు, ఆరుతడి పంటలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఆ నీరు ఇవాళ లేదా రేపటిలోగా వైరా రిజర్వాయర్‌కు చేరుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరడంతో రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి, కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిస్థాయిలో లేకపోయినా రైతుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కేంద్రం నుంచి అవసరమైన ఎరువులు సాధించామని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు టెక్నాలజీ వినియోగిస్తూ యాప్ ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే వర్షాల సమాచారాన్ని కూడా సాంకేతికత ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నామని వెల్లడించారు.

# హరీష్ రావుపై కెసిఆర్‌కు నమ్మకం లేదు

(మొదటి పేజీ తరువాయి)

చిట్‌చాట్ చేశారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీలో డ్యామేజీల మరమ్మతులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరుతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా తాము సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లాల వారీగా కార్యాచరణకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి పరిస్థితినీ ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు. గ్రామసభల ద్వారా ఎల్‌నినోపై చైతన్యం కల్పిస్తామన్నారు. శాస్త్రవేత్తల సూచనలతో పంటల ఎంపిక చేసుకోవాలని, ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ల నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించ నున్నట్లు మంత్రి తెలిపారు. సాగునీటి వినియోగం శాస్త్రీయంగా నిర్వహిస్తామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో నిరంతరం సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వదంతులను నమ్మొద్దని.. అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్చువల్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు.

## ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా

# కాంగ్రెస్ పంచాయితీ

### కొండా వర్సెస్, కడియం అన్నట్లుగా పరిస్థితులు

### మంత్రి పనితీరుపై కాంగ్రెస్ నేతలల్లో అసంతృప్తి



**వరంగల్,జూలై 09 :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు జిల్లాలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పుడు కొండా వర్సెస్ కడియం లాగా పరిస్థితి మారింది. కొండా తీరుపైనా స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. దేవాలయాలను గాలికి వదిలేశారని, అన్యాక్రాంత భూములపై చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్‌లోనే విమర్శలు ఉన్నాయి. ఇకపోతే తాజా వివాదంటీపీసీసీ దృష్టికి చేరాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను బుధవారం కలిసి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై తనకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించారని, ఇది ప్రభుత్వ ప్రోటోకాల్‌కు విరుద్ధమని కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. ఇదే విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, గ్రూపు రాజకీయాలపై పార్టీ ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోందని చెప్పారు. కొండా సురేఖ, కడియం శ్రీహరి ఇద్దరితో త్వరలోనే మాట్లాడి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించకూడదని, అలాంటి చర్యలను పార్టీ ఏమాత్రం సహించబోదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని ఆయన తెలిపారు.

# బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల, తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.

# మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా..మిగతా .2,845.12 కోట్లు ఊఓఆం లేదా ⊹ఉఎఎఅ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ విధానంలో నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ నియామకానికి సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్(ఓళీఆఅబ)కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# కాంగ్రెస్ పార్టీ పని ఇక అయిపోయినట్టేనని రేవంత్ రెడ్డి సొంత సర్వేలోనే తేలింది : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ మాట్లాడుతూ.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే భారత రాష్ట్ర సమితి సుమారు 78 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ సర్వేలో తేలిందన్నారు. దీంతో పాటు రెండు మీడియా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ విభాగాలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే అంశం వ్యక్తమైందన్నారు. మరోసారి ప్రజలు కేసీఆర్ ను ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నామని స్పష్టంగా తమ అభిప్రాయం చెప్పిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అయితే తన సొంత సర్వేతో పాటు పలు సర్వేల్లో వ్యక్తమైన ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే ముఖ్యమంత్రి గత వారం రోజులుగా అడ్డగోలుగా మాట్లాడుతున్నా రన్నారు. దీంతోపాటు తన పరిపాలన వైఫల్యాలను ముఖ్యంగా కప్పిపుచ్చుకునేందుకు అనేక అటెన్షన్ డైవర్షన్ పనులు చేస్తున్నారని, అందులో భాగంగానే కాళేశ్వరం నుంచి మొదలుకొని రైతుబంధు వరకు అన్నింటిపైన అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. **కాంగ్రెస్ పార్టీ పుంజుకునే అవకాశమే లేదు..**

కాంగ్రెస్ పార్టీ పతనం దాదాపు ఖాయమైపోయిందని, సగం పరిపాలనా కాలం ముగిసిన తర్వాత ప్రజలు కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఇచ్చిన గ్యారంటీల అమలు, గ్యారంటీలు, డిక్లరేషన్లు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైనందు వల్లనే తెలంగాణలోని సబ్బండ వర్గాలు కాంగ్రెస్ పార్టీ పరిపాలనపై నమ్మకం కోల్పోయారన్నారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా స్పష్టంగా ప్రజలు బీఆర్ఎస్ కావాలని కోరుకుంటున్నారని, బీజేపీ లాంటి ఇతర పార్టీలకు ఏమాత్రం అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా లేరన్నారు.కాంగ్రెస్ పార్టీ జారుడు బండపైన నిలబడిందని, ఇక పుంజుకునే అవకాశమే లేదన్నారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా, ఎన్ని రకాల అబద్ధాలు చెప్పినా, ప్రజలను మోసం చేయాలని చూసినా కాంగ్రెస్ పార్టీ ముందు ముందు ప్రజామోదం పొందడం అత్యంత కష్టమన్నారు.

# స్పీకర్, మండలి చైర్మన్‌తో సిఎస్ భేటీ

**హైదరాబాద్,జూలై 09 :** తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.


# బిఆర్ఎస్ ఖాతాలోని 1400 కోట్లు పంచాలి

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగూడెంలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మా పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా ఫిర్యాదులు ఇచ్చారు. టీఆర్ఎస్ పేరు నాకు రాకుండా కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి నీతినియమాలు అంటూ ఏమీ లేవా? తల్లి, చెల్లి అనే సభ్యత మరిచి పార్టీ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. నా కంఠంలో ప్రాణముండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లను. నా పోరాటాలు ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, భాజపా చేతులు కలిపాయని ఆరోపించారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రోకో కింద కేటీఆర్ అక్రమ పర్మిషన్లు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్‌రావు అనకొండ. బీఆర్ఎస్ పార్టీ ఇంకా ఆయన్నే ముందు పెడుతోంది. ఆ పార్టీ ఈ జన్మలో బాగుపడదు.. అధికారంలోకి రాదు. పెద్దాయనకు మరకలు అంటించిన ఆయనకు 3 నెలలు మంత్రి పదవి కావాలంట. కేటీఆర్ ఇటీవల రూ.188 కోట్లతో ఓ ఇంగ్లిష్ పత్రిక కొన్నారు. ఫీనిక్స్ సంస్థకు రూ.80వేల కోట్ల విలువైన భూముల కట్టబెట్టారు. ఆ సంస్థ రూ.33 లక్షల టన్నుల కలప కొట్టేస్తోందని కవిత ఆరోపించారు.

# బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

### - దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్, జూలై 09 :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరిం చాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం, జూలై 10, 2026


# ప్యారామూర్‌కు భక్తుల పాదయాత్ర



**ఖానాపూర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణానికి చెందిన సాయి భక్తులు గురువారం ఉదయం జంగల్ హనుమాన్ సాయిబాబా ఆలయం నుండి ప్యారామూర్ అవధూత్ మహారాజ్ సంస్థానానికి 70 కిలోమీటర్ల పాదయాత్రను ప్రారంభించారు.ఆలయ పూజారి రామకృష్ణ పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు బయలుదేరారు. అవధూత్ మహారాజ్ సమాధి దర్శనానికి వెళ్తున్నామని భక్తులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొక్కుల ప్రదీప్ భక్తుల యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ పాదయాత్రలో దాదాపు 20 మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కొక్కుల ప్రదీప్, పూజారి రామకృష్ణ, విలాస్ కుమార్, రాజేందర్ గౌడ్, అనిల్ రావ్, మహిళలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సర్వేపై కాంగ్రెస్ నేతలు అప్రమత్తంగా ఉండాలి



**ఖానాపూర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో జరుగుతున్న ఎస్ఐఆర్ సర్వేలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని నేతలు సూచించారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కౌన్సిలర్ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పట్టణంలో జరుగుతున్న ఎన్యుమరేషన్ పారాల సర్వేను కాంగ్రెస్ కార్యకర్తలు దగ్గరుండి పర్య వేక్షించాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు రాజు రా సత్యం, గొర్రె గంగాధర్, కాంగ్రెస్ నాయకులు షబ్బీర్ భాష, జొన్నారపు శంకర్, జహీర్, జియా, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల పిలుపు



**ఖానాపూర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ ప్రజావ్యతిరేక విద్యా విధానాలకు నిరసనగా నేడు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్, వీడియోస్ యూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో వసతులు లేకపోవడం, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ--అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయకపోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూలు తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.బంద్‌కు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నియోజకవర్గ మండల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తవ్వకాలపై ఉపసర్పంచ్ ఆగ్రహం

**ఖానాపూర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తర్లపాడు, పాత తర్లపాడు గ్రామాల పరిసరాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని గ్రామ ఉపసర్పంచ్ సార్ల నరసయ్య అటవీశాఖ ఎఫ్ఆర్‌వో కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. వాగులు, వంకల నుంచి అక్రమంగా ఇసుక తవ్వి నిర్మానుష్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి, పర్యావరణానికి నష్టం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఇసుక డంపులను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.అక్రమ ఇసుక రవాణా సీజ్ చేసిన తర్వాత కొంతమంది నాయకులు విడిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో గ్రామ ఉపసర్పంచ్ స్వయంగా చర్యలు కోరడం అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఈ నెల 12న ఏఐకేఎంఎస్ జిల్లా మహాసభలకు పిలుపు

**ఖానాపూర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని హంపోలి కె గ్రామంలో ఈనెల 12న మహాసభలు జరగనున్నాయని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో నాయకులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాలి, రాజేశ్వర్, మాంత శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్నందున ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులు ఆదేశించారు.రాష్ట్ర మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆమె వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించి ఆరుతడి పంటలు, పప్పు ధాన్యాలు, తృణ ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు.ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే సాగు చేస్తే బోనస్ పొందవచ్చని తెలిపారు. యూరియా అమ్మకాలు ఆన్లైన్‌లో కొనసాగుతున్నందున ఎరువుల పంపిణీ సమస్యలు ఉండవని చెప్పారు. వ్యవసాయ అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో ఉండి రైతులకు సాంకేతిక సలహాలు, వాతావరణ సూచనలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని ఆమె స్పష్టం చేశారు.

# యువజన హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

**- పంజాల శ్రీనివాస్**





**కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అఖిల భారత యువజన సమాఖ్య నగర మహాసభ బద్దం ఎల్లారెడ్డి భవనంలో జరిగింది. నగర అధ్యక్షుడు చెంచల మురళి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగంధర్ పతాకాన్ని ఎగరవేశారు.ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ యువజన హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆయన విమర్శించారు.యుగంధర్ మాట్లాడుతూ నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతుందని, యువతను మోసం చేసిన ప్రభుత్వాలపై పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. జూలై 13న జరగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని యువతను కోరారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బీర్ల పద్మ, ఏఐవైఎఫ్ నాయకులు కసిబోజుల సంతోషి చారి, కాల్వ శ్రీనివాస్ యాదవ్, మేకల రమ, సంపత్ నాయక్, జువ్వాడి తిరుపతి, హేమంత్, శ్రావణ్, బిర్లా స్వాతి, ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల రుణాలను వేగవంతం చేయాలి కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పథకాల కింద రుణ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా అర్హులైన వారికి వెంటనే మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బ్యాంకర్లను ఆదేశించారు.జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, పీఎం స్వనిధి రుణాల పంపిణీని వేగవంతం చేయాలని సూచించారు. తిరస్కరించే దరఖాస్తులకు సరైన కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో రైతులకు ఇప్పటివరకు రూ.1,488 కోట్ల పంట రుణాలు అందించామని, ఎంఎస్ఎంఈ రంగంలో లక్ష్య సాధన తక్కువగా ఉందని, ప్రైవేట్ బ్యాంకులు కూడా లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.పీఎం స్వనిధి పథకం కింద వీధి వ్యాపారులకు రుణాల పంపిణీ పెంచాలని, సకాలంలో చెల్లించిన వారికి మూడో విడత రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన వంటి సామాజిక భద్రత పథకాలను ప్రతి అర్హులైన ఖాతాదారుడికి అందించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్థాయిలో ఆర్థిక అక్షరాస్యత శిబిరాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, నాబార్డ్, ఆర్బీఐ ప్రతినిధులు, బ్యాంకుల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రతీ అర్హుడి ఓటును పరిరక్షించాలి : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**వెల్దండ, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్లో జరిగిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ -- ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి అర్హుడి ఓటు పరిరక్షించబడాలని, బిఎల్ఏలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్‌లోని ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఏ ఓటరు పేరు కూడా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ఓటర్ల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి



కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజల మద్దతుతో మరోసారి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యేంతవరకు బిఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు మరింత బలంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూపతిరెడ్డి, డీసీసీ కార్యదర్శి మోతిలాల్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు హరికిషన్ నాయక్, వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, తహసీల్దార్ కార్తీక్ కుమార్, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, బృంగి రత్నమాల, ఆనంద్ కుమార్, సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్ ముదిరాజ్, సర్పంచులు, వార్డు సభ్యులు, బిఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూమి వివాదంపై రైతుల ఆగ్రహం



పెద్దపల్లి, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు సర్వే నంబర్ 226లో 18 గుంటల భూమి రిజిస్ట్రేషన్‌పై ఆరోపణలు కాకుండా ఆధారాలు చూపించాలని రైతులు డిమాండ్ చేశారు. జిల్లా ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, 1979లో తమ తండ్రి సింగిరెడ్డి మల్లారెడ్డి చట్టబద్ధంగా కొనుగోలు చేసిన 9 ఎకరాల 10 గుంటల భూమిని అప్పటి నుంచి సాగు చేస్తున్నామని తెలిపారు. 2012లో లేని భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి, 2015లో ముంజంపల్లి లింగమూర్తి పేరిట నమోదు చేయడం అనుమానాస్పదమని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన రికార్డుల్లో కూడా సర్వే నంబర్ 226లో మిగులు భూమి లేదని స్పష్టమైందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లింగమూర్తి పేరు తొలగించినప్పటికీ, అనంతరం 226/దీ/1 పేరుతో తిరిగి నమోదు చేయడం విచారణకు గురి కావాలని వారు కోరారు. ప్రభుత్వ భూములు, నిధులకు నష్టం జరగకుండా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సింగిరెడ్డి రామచంద్రారెడ్డి, కోటిచింతల మురళీధర్ రావు, తాటికొండ అనిల్, భీం సేన్ గౌడిసేలా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తపరిచిన ఎ.వి. రమణ



కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను ఒకే కేంద్రంలో నిర్వహించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందని అడ్వకేట్, మాజీ కార్పొరేటర్ ఎ.వి. రమణ అభిప్రాయపడ్డారు. బూత్ లెవెల్ అధికారులను ఒకే చోటకు సమీకరించడం ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. సంబంధిత కార్పొరేటర్ ఎన్నిక చెల్లుబాటు పై కేసు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. 12వ డివిజన్ పరిధిలో బినామీ ఓటర్ల నమోదు అంశాన్ని గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎన్నికల జాబితా సవరణ పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాలని, ప్రతి బిఎల్ఓ తన పరిధిలోనే విధులు నిర్వర్తించేలా కమిషనర్, ఎమ్మార్వో చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎ.వి. రమణ కోరారు.

# ప్రతి ఓటరు తమ పారాలను సకాలంలో పూర్తి చేసి ఇవ్వాలి



ఖానాపూర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): దిలావర్పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా సర్వే ప్రారంభమైంది. బీఎల్ఏ, బీఎల్ఓ సత్యవ్వ, పోశెట్టి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పారాలను సకాలంలో పూర్తి చేసి ఇవ్వాలని కోరారు. సమయానికి వివరాలు అందిస్తే వాటిని ఆన్లైన్ ద్వారా పై అధికారులకు పంపడం సులభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలు, బీఎల్ఓలు, ఓటర్లు పాల్గొన్నారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో బంజారా తీజ్ ఉత్సవాలు



కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): శాతవాహన విశ్వవిద్యాలయ లైబ్రరీ ప్రాంగణంలో బంజారా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రకృతిని ఆరాధించే తీజ్ పండుగ బంజారాల విశిష్ట సంస్కృతికి అద్దం పడుతుందని, విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుంటూనే తమ సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. ఆచార్య పి. సతీష్ కుమార్, ఎస్సీ--ఎస్టీ సెల్ డైరెక్టర్, ఆర్ట్స్, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమాకాంత్ తదితరులు పాల్గొని బంజారా సంస్కృతికి తీజ్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం ప్రతినిధులను అతిథులు అభినందించి, విశ్వవిద్యాలయ అధికారులను శాలువాలతో సత్కరించారు. వివిధ విభాగాలఅధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో అన్న అక్క మెంటర్‌షిప్ ప్రోగ్రాం



రామడుగు, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రామడుగు మండలం వన్నారం ప్రాథమికోన్నత పాఠశాలలో అన్న--అక్క మెంటర్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజ్, కరీంనగర్ విద్యార్థులు ఏ--బుక్ ఆఫ్ డిజిటల్ లెర్నింగ్ ప్రోగ్రాం పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు డిజిటల్ బోధన ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస రెడ్డి, రాము సార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముద్దం రాజశేఖర్, ఉపాధ్యాయులు సునీత, లక్ష్మీరాజం, ఉమాపతి, కళావతి, మహిషా తదితరులు పాల్గొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్ల అవగాహన సదస్సు





అమ్రాబాద్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమ్రాబాద్ మండల కేంద్రంలోని రైస్ మిల్ ఆవరణంలో బూత్ లెవెల్ ఏజెంట్ల అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఫోన్ ద్వారా బిఎల్ఏ సభ్యులతో మాట్లాడారు. రాబోయే ఎస్ఐఆర్ ప్రత్యేక సవరణలో భాగంగా ఓటర్ జాబితాను పటిష్టం చేయాలని సూచించారు. అర్హులైన ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపుపై బిఎల్ఏలు, బిఎల్ఓలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. స్థానిక అధికారులతో కలిసి ఓటర్ జాబితా మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, తప్పుడు సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిగురుల కోటయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఏ రహీం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య, బిఎల్ఏ పరిశీలకుడు ఎడ్ల ఆనంద్, రాష్ట్ర యువ నాయకులు కుందా మల్లికార్జున్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి




సిద్దిపేట, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో నీటి నిల్వలు, ఖరీఫ్ పంటల ప్రణాళికపై రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూలై 9 నాటికి రాష్ట్రంలో 15 శాతం వర్షపాతం లోటు నమోదైందని, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో తాగునీటికి మాత్రమే సరిపడా నీరు ఉందని తెలిపారు. సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో వరి సాగు చేయకుండా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. రైతు వేదికలు, ప్యాక్స్‌ల ద్వారా ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యత, వర్షపాతం అంచనాలపై విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తూ విత్తనాల సరఫరా చేపట్టాలని సూచించారు. ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మహారాష్ట్ర, కర్ణాటక వరద పరిస్థితులను పరిశీలించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇచ్చి ఆయిల్‌పామ్, ఉద్యాన పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, వ్యవసాయ అధికారి స్వరూపారాణి, ఉద్యానవన అధికారి సువర్ణ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# నూతన చౌక ధరల దుకాణం ప్రారంభం




కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గాంధీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చౌక ధరల దుకాణాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి 53వ డివిజన్ కార్పొరేటర్ కొంపెల్లి శ్వేత రమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు నిత్యావసర సరుకులు సకాలంలో అందేలా ఈ దుకాణం ఉపయోగపడుతుందని, విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్సీసీ ప్రత్యేక సమావేశం



కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అల్ఫోర్స్ సీబీఎస్ఈ పాఠశాలలో 9వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ జయంత ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పాఠశాల స్థాయి నుంచే దేశభక్తి పట్ల అవగాహన పెంపొందించాలని, ఎన్సీసీ ద్వారా సమాజానికి సేవ చేసే విధానాలను నేర్చుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఏఎన్ఓలతో విస్తృతంగా చర్చించారు. 2026--27 సంవత్సరానికి అమలు చేయబోయే కార్యక్రమాలు, అవసరమైన వనరులపై కూడా చర్చలు జరిగాయి. సమావేశంలో వివిధ పాఠశాలల ఏఎన్ఓలు పాల్గొన్నారు.

# గురుకులంలో ఫుడ్ పాయిజన్ కలకలం



అమ్రాబాద్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మన్ననూర్ పీటీజీ గురుకుల పాఠశాలలో సోమవారం ఫుడ్ పాయిజన్ కారణంగా 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఢిల్లీ పర్యటనలో ఉండగానే వీడియో కాల్ ద్వారా వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి కూడా ఘటనపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులు చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని వైద్యులు వెల్లడించారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

# జిల్లా విద్యాశాఖ అధికారితో టీఎన్జీవోల ప్రతినిధుల సమావేశం



కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో టీఎన్జీవోల సంఘం ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారి నరేడ్ల ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారి హామీ ఇచ్చారు. అనంతరం సంఘం నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, టీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, పట్టణ కార్యదర్శి వెలిచాల సుమంత్ రావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు తోట రామ స్వామి, శంకర్, మర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ శిర్డీ సాయిబాబా దేవాలయ వార్షికోత్సవం వేడుకలు



సుల్తానాబాద్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): స్వప్న కాలనీలోని శ్రీ గణపతి దత్తాత్రేయ సుప్రభాత శ్రీ శిర్డీ సాయిబాబా దేవాలయ 17వ వార్షికోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేసి గణపతి పూజ, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేసి మహామంగళ హారతి అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు ధన నాయక దామోదర్ రావు, అమ్మిశెట్టి తిరుపతి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# స్ట్రామ్ వాటర్ డ్రైన్‌పై స్లాబ్ నిర్మాణం



కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎస్‌బిఎస్ ఫంక్షన్ హాల్ నుండి కలెక్టరేట్ వరకు ఉన్న ఓపెన్ స్ట్రామ్ వాటర్ డ్రైన్‌ను బీజేపీ రాష్ట్ర ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా కాలువ పాడైపోయిన చోట పునర్నిర్మాణం చేసి, అవసరమైన చోట రిటైనింగ్ వాల్స్ నిర్మించి, మొత్తం డ్రైనేజీపై స్లాబ్ వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనివల్ల దుర్వాసన తగ్గడమే కాకుండా ప్రమాదాలు నివారించబడతాయని, రాబోయే వర్షాకాలానికి ముందు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు గట్టు స్వామి, కాలిద్, కాలనీవాసులు ఆంజనేయులు, వామన్ రావు, శంకరయ్య, సత్యం, సురేందర్, లక్ష్మణమూర్తి, నారాయణ గౌడ్, కనకయ్యతో పాటు మహిళలు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం,
జూలై 10, 2026



# జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా కర్ణాటక సంగీత వర్క్‌షాప్



**కరీంనగర్ రూరల్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్పైస్ మకాయ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరుగుతున్న విరాసత్--2026 కార్యక్రమంలో భాగంగా మల్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కర్ణాటక సంగీత వర్క్‌షాప్ ఘనంగా జరిగింది. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు జె. సత్య శ్రీరామ్ విద్యార్థులకు భారతీయ శాస్త్రీయ సంగీత విశిష్టత, రాగాలు, తాళాలు, సంప్రదాయాలపై ఆసక్తికరంగా వివరించారు. సంగీత ప్రదర్శనతో పాటు విద్యార్థులతో పరస్పర సంభాషణ నిర్వహించి, భారతీయ సంస్కృతి పరిరక్షణలో యువత పాత్రను వివరించారు.కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు ఈ. అంజనేయులు అధ్యక్షత వహించగా, ఏ.ఏ.పి.సి చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముగింపులో ప్రధానోపాధ్యాయులు కళాకారులను అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో భారతీయ సాంప్రదాయ కళలపై ఆసక్తి పెంపొందిస్తాయని తెలిపారు.

# మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు అంతరాయం

**కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్ఎండీ ఇన్‌టేక్ వెల్‌లో వరంగల్‌కు సంబంధించిన మోటార్ల మరమ్మత్తు పనుల కారణంగా హుజూరాబాద్, హుస్నాబాద్, మానకొండూరు నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా తాత్కాలికంగా నిలిచిపోనుంది.జూలై 10 మధ్యాహ్నం 1 గంట నుండి జూలై 11 సాయంత్రం 7 గంటల వరకు నీటి సరఫరా అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ప్రజలు ముందుగానే తాగునీటిని నిల్వ చేసుకోవాలని, తాత్కాలికంగా గ్రామపంచాయతీ ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జై రామ్ కుమార్ సూచించారు.

# మైనారిటీలకు ఉచిత పోలీస్ శిక్షణ

**కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా మైనారిటీల సంక్షేమ కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించనుంది.అర్హులైన ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన్, పార్సీ, బౌద్ధ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణలో జనరల్ స్టడీస్, అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ, శారీరక దారుఢ్యం అంశాలు ఉంటాయి.దరఖాస్తులు జూలై 7 నుండి ప్రారంభమై జూలై 13 వరకు స్వీకరించబడతాయి. తరగతులు జూలై 15న ప్రారంభం కానున్నాయి. పరిమిత సీట్లు మాత్రమే ఉండగా, ఎస్ఐకి 50, కానిస్టేబుల్‌కు 100 సీట్లు మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.మొత్తం 7,437 పోస్టులు భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కావలసిన పత్రాలు: విద్యా అర్హత సర్టిఫికెట్లు, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు.రిజిస్ట్రేషన్ వేదిక: తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్, ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కాలేజ్ ప్రాంగణం, గోషామహల్, నాంపల్లి, హైదరా బాద్.సంప్రదించవలసిన నంబర్: 0878-2957085(ఉదయం 10:30--సాయంత్రం 5:00 వరకు).

# ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెరుగుదల



**ఖానాపూర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని బావాపూర్ కె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతేడాది 33 మంది ఉన్న విద్యార్థులు ఈ సంవత్సరం 80 మందికి చేరడం విశేషం. పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు కలిసి టీవీ ఏర్పాటు, ఆటపాటలు, ప్రార్థన తర్వాత క్విజ్‌లు, మధ్యాహ్న భోజనంలో సరిపడా ప్లేట్లు, సౌండ్ సిస్టమ్ ద్వారా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఆకర్షితులయ్యారు.గ్రామ సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధతో ఇద్దరు విద్యా వాలంటీర్లను నియమించగా, ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ తరగతులు కూడా పాఠశాలకు మంజూరయ్యాయి. ప్రధానోపాధ్యాయుడు సంతోష్ కృషి పట్ల గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలని ఆదేశాలు



**మంథని, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా ఇంటర్ విద్యాధికారిణి కల్పన గురువారం మంథని బాలికల, బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కళాశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నామని, లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గతేడాదికన్నా ఎక్కువగా అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించి అడ్మిషన్ల సంఖ్య పెంచాలని, విద్యార్థులు ఉంటేనే కళాశాలలు నిలబడతాయని, తగ్గకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అన్నారు.తరగతి గదుల్లో విద్యార్థుల నోట్‌బుక్స్‌ను తనిఖీ చేసి, అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు బాలోజీ, ఉషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

# నిజాయితీని చాటిన అడ్డూరి సంతోష్



**పెద్దపల్లి, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రోడ్డుపై దొరికిన విద్యార్థి ముఖ్యమైన సర్టిఫికెట్లను యజమానికి సురక్షితంగా అందజేసి నిజాయితీని చాటారు ఆంధ్రజ్యోతి సర్క్యులేషన్ ప్రతినిధి అడ్డూరి సంతోష్.సెంటనరీ కాలనీ నుండి పెద్దపల్లి వైపు వస్తుండగా రాఘవాపురం పెట్రోల్ బంక్ సమీపంలో ఫైల్ దొరకగా, అందులో విద్యార్థి చరణ్ బానోత్‌కు సంబంధించిన విద్యా సర్టిఫికెట్లు ఉన్నట్లు గుర్తించారు. ఫైల్‌లో ఉన్న ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించి, చరణ్ తండ్రి పరశు నాయక్‌కు పత్రాలను అప్పగించారు. ముఖ్యమైన సర్టిఫికెట్లను భద్రంగా అందించిన సంతోష్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీతో వ్యవహరించినఆయననుపలువురుఅభినందించారు.

# సిటీ కళాశాలలో ఘనంగా ఎబివిపి 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిటీ కళాశాలలో ఎబివిపి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఎగురవేయడం జరిగింది.ఈ సందర్భంగా కళాశాల ఎబివిపి అధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ -- “డిల్లీలో ఐదుగురు వ్యక్తులతో ప్రారంభమైన ఎబివిపి, నేడు 77 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంస్థగా పరిణతి చెందింది” అని పేర్కొన్నారు. ఎన్నో వడిదుడుకులను ఎదుర్కొంటూ 77 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణాన్ని విజయవంతంగా ముగించుకొని 78వ నవ వసంతంలో అడుగెడుతున్న ఎబివిపి కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అఖండ భారతావనిని తిరిగి దక్కించుకోవాలని కసితో పని చేస్తున్న విద్యార్థి ఉద్యమమని అన్నారు. అణువణువున దేశభక్తిని నిలుపుకొని, సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పాటుపడుతున్న సంస్థ ఎబివిపి మాత్రమేనని విశ్వసిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. “వ్యక్తి నిర్మాణంతోనే జాతి పునర్నిర్మాణం సాధ్యమవుతుంది” అని ఆయన వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ టౌన్ సెక్రటరీ అక్షయ్, విద్యార్థి నాయకులు అరవింద్, దుర్గ, అఖిల్, మనీష్, సన్నీ, జతిన్, అంజి, ప్రశాంత్, అమన్, వినోద్, సాత్విక్, సాగర్, రాహుల్, భాను, చిన్మయి, నిహార్, రాజేష్, నవనీత్, జగదీష్‌తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ 2026 ప్రక్రియ



**మర్రిగూడ, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని తమ్మడపల్లి గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని మండల తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు.తమ్మడపల్లిలో జరుగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఎస్ఐఆర్ విజయవంతానికి ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని తహసిల్దార్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కమ్మ చిచ్చు వెంకట్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేకల జగన్ రెడ్డి, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, బిఎల్ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆషాఢ మాసంలో పూర్వఫాల్గుణి నక్షత్రంలో శుక్రుడి ప్రవేశంతో కుంభం సహా ఈ 5 రాశులకు కుబేరుని అనుగ్రహం!

జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, ఆషాఢ మాసంలో శుక్రుడు పూర్వ ఫాల్గుణి నక్షత్రంలో ప్రవేశించడంతో మేషం, కుంభం సహా ఈ 5 రాశుల వారికి కుబేరుని ఆశీస్సులు లభించే అవకాశం ఉంది. ఈ జాబితాలో మీ రాశి ఉందేమో చూసెయ్యండి.




జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, శుక్రుడికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సంపద, ఐశ్వర్యం, ప్రేమ, సౌందర్యం, విలాసవంతమైన జీవితానికి సంకేతంగా భావించే శుక్రుడు ప్రస్తుతం సింహరాశిలో సంచారం చేస్తున్నాడు. అయితే 16 జూలై 2026న ఆషాఢ మాసంలో మాఘ నక్షత్రం నుంచి పూర్వఫాల్గుణి నక్షత్రంలోకి సంచారం చేయనున్నాడు. వేద జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, ఒక గ్రహం తన సొంత నక్షత్రంలో ప్రవేశించినప్పుడు అత్యంత శుభప్రదంగా పరిగణించబడుతుంది. అంతే కాదు సూర్యుడు కూడా సింహ రాశిలో ఉండటం కారణంగా మేషం, కుంభం సహా 5 రాశుల వారికి ఆర్థిక పరంగా గణనీయమైన ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. వ్యాపారులకు ఊహించిన విధంగా లాభాలొచ్చే అవకాశాలున్నాయి. ఈ సందర్భంగా ఆషాఢ మాసంలో అదృష్టాన్ని పొందే రాశులేవో ఇప్పుడు తెలుసుకుందాం.

?మేషరాశి వారికి శుక్రుడి నక్షత్ర సంచారం సమయంలో ప్రత్యేక ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది.

# మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్



**సుల్తానాబాద్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామంలోని వాగోడ్డుపల్లిలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం జరిగింది.రైతు దేవరనేని రాజేశ్వరరావు 20 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఐఐఓపిఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ, సరైన నీటి, ఎరువుల యాజమాన్యంతో మూడవ సంవత్సరం నుంచే మంచి దిగుబడి లభిస్తుందని తెలిపారు. నీటి వసతులు ఉన్న రైతులు ఆయిల్ ఫామ్ సాగును విస్తరించాలని సూచించారు.

# సర్పంచ్ వెన్న స్వర్ణలత రాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**హుస్నాబాద్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో బాలవికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత రాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెన్న రాజు మాట్లాడుతూ, పేద కుటుంబాలకు ఇలాంటి ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని, వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందించడం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతోందని అన్నారు.డాక్టర్ సమతతో పాటు వైద్య బృందం గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బత్తుల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి దివ్య, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ గీకురు శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ బత్తుల రేణుక, ఈజీఎస్ మేట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కారు బోల్తా పడి ఒకరు మృతి, ఐదుగురు గాయాలు





**ఖానాపూర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ జిల్లా మామడ మండలం దిమ్మదుర్తి గ్రామ పరిధిలో సదరమ్మడు కెనాల్ దగ్గర కారు ప్రమాదం జరిగింది. కుక్కను తప్పించబోయి కారు (టీఎస్ 18 హెచ్ 4183) రహదారి బయట పడిపోవడంతో రాజురా గ్రామానికి చెందిన గంగడి దశరథ్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు.మృతుని కుటుంబ సభ్యులు సహా ఐదుగురు తీవ్రంగా గాయపడి స్థానికులు వారిని నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. ముజిగి గ్రామంలో చావుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.మామడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల నిఘా అత్యంత కీలకం సీపీ గౌష్ ఆలం





**హుజురాబాద్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల నిఘా అత్యంత కీలకమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. హుజురాబాద్ డివిజన్ పరిధిలో సైదాబాద్ గ్రామంలో 16, కొరపల్లి గ్రామంలో 5 సీసీ కెమెరాలను ఆయన గురువారం ప్రారంభించారు. కమిషనరేట్ వ్యాప్తంగా మరో 700 కెమెరాలను ఏర్పాటు చేయడం లక్ష్యమని వెల్లడించారు.సీపీ మాట్లాడుతూ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్ ముప్పు, డ్రగ్స్ వాడకం వంటి సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, యువత క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. రహవీర్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి రూ.25 వేల బహుమతి అందజేస్తారని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సర్పంచులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, రూరల్ ఇన్స్పెక్టర్ వెంకట్, ఎస్సైలు, స్థానిక ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

RNI - TELTEL/2023/87644

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన డా. బోగ శ్రావణి



జగిత్యాల, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):జగిత్యాల పట్టణంలోని 5వ వార్డ్, 49వ వార్డుల్లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణి స్థానిక వార్డ్ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ -- ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. పార్టీ సూచనల మేరకు బీజేపీ బీఎల్ఏ ఏజెంట్లు, ఐటీ & లీగల్ సెల్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు ప్రతి బూత్ స్థాయిలో ప్రజలకు సహకారం అందిస్తూ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.ఓటరు జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే క్రమంలో చనిపోయిన వారి పేర్లు, అర్హత లేని లేదా నకిలీ ఓట్లు, ఇతర ప్రాంతాలకు లేదా విదేశాలకు వెళ్లిన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునే బాధ్యతతో అవసరమైన పత్రాలను సమర్పించి, తమ పేరును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో నమోదు ప్రక్రియను పూర్తి స్థాయిలో నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, బూత్ స్థాయి కార్యకర్తలకు ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ కౌన్సిలర్ వేముల శ్రీనివాస్, 49వ వార్డ్ కౌన్సిలర్ సిరిపురపు శ్రీలత--శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, కశేటి తిరుపతి, బద్దెం గంగరాజం, బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ రామేశ్వరాలయ పదో వార్షికోత్సవం



సుల్తానాబాద్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని శ్రీ రామేశ్వరాలయంలో పదో వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది.గణపతి పూజ, నవగ్రహ పూజ, హోమం, పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదం, పంచామృతం పంపిణీ చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అడ్డగుంట రాజేందర్, మాజీ మండల అధ్యక్షుడు చీటి కేశవరావు, మాజీ సర్పంచ్ మోరపల్లి మోహన్ రెడ్డి, మాజీ చైర్మన్ ఉమ్మెంతల భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ దాసరి రాయమల్లు, కనపర్తి సాగర్ రావు, తాళ్లపల్లి మనోజ్ గౌడ్, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.పూజా కార్యక్రమాలను పూజారి ఈశ్వర్ ప్రసాద్, సత్యనారాయణ నిర్వహించారు.

# మహితాపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్



రాయికల్, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):రాయికల్ మండలం మహితాపూర్ గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. అదేవిధంగా రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి, రూ.8 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు.గ్రామంలో సఫాయి కార్మికుడు స్వామితో పాటు ఇతర లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి చీర కానుకగా అందజేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, సర్పంచ్ తలారి నాగమణి రాజేష్, ఉప సర్పంచ్ దొంగ ప్రణయ్ రెడ్డి, పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ఎమ్మెల్యే నాగార్జున, డీఈ మిలింద్, మాజీ జడ్పీటీసీ గోపి రాజిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రావు, సురేందర్ నాయక్, కోల శ్రీనివాస్, సర్పంచ్ జిల్లెంకి మోహన్, ఏఈ ప్రసాద్, మండల సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ మహిళలు, యువత, కుల సంఘాల పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవం వేడుకలు



హుస్నాబాద్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా మహిళా కన్వీనర్ మృదులయ మాట్లాడుతూ, 5 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ నేడు 78 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలిచిందని తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యార్థి హక్కుల కోసం పోరాటాలు చేసి, జాతీయవాదాన్ని బలపరిచిందని పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ప్రతి విద్యార్థి దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యదర్శి బత్తుల రాజు, జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ చరణ్, ఉపాధ్యక్షుడు బత్తుల సంతోష్, సంయుక్త కార్యదర్శి రంజిత్, మహిళా కన్వీనర్ శిరీష, ఇతర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



ఇబ్రహీంపట్నం, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మంచాల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు రూ.14,47,000 విలువైన చెక్కులను గురువారం అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ -- "సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిది. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయి. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి" అని పేర్కొన్నారు .ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని వారు అన్నారు.ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు నూకం బాలరాజు, చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రతినిధి బైరెక రమాకాంత్ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ పంది రమేష్, మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య, వార్డు సభ్యులు అనంగల్ల జగన్నాథం, కాంగ్రెస్ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, దాసరమోని రమేష్, చెరుకు నర్సింహ, బట్టి కృష్ణ, కంబాలపల్లి బుగ్గరాములు, కోరె బాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగల పరమేష్, పస్పరి కుమార్, తలారి కృష్ణ, నూకం మల్లేష్, లచ్చగారి జంగారెడ్డి, దాసరమోని అశోక్, జిలమోని శ్రీనివాస్, చీమర్ల క్రాంతికుమార్, నూకం శేఖర్, ఎండి అశ్రఫ్, ఆడెపు మధు, అలువాల ప్రసాద్, దిలీప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కె. శ్రీధర్



హుస్నాబాద్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ పోలీస్ సర్కిల్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా కె. శ్రీధర్ నియమితులయ్యారు. పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సీఐగా పనిచేసిన కొండ్ర శ్రీను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్న శ్రీధర్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.బదిలీపై వెళ్ళన్న కొండ్ర శ్రీను హుస్నాబాద్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు చేసిన సేవలను పలువురు ప్రశంసించారు.

# నేటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

దేవరకొండ, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నేడు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు బుడిగ వెంకటేష్, వట్టిపు శివకుమార్ పిలుపునిచ్చారు.దేవరకొండ పట్టణంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడుతూ -- ప్రభుత్వం కాలేజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వేలాది మంది విద్యార్థులు చదువును కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అంకూరి ప్రణయ్, దుబ్బ కార్తీక్, బత్తుల శివ, పులిజాల శివ, జిటమోని సతీష్, పల్లె చైతన్య, దాసరి శివ, దర్శనం సతీష్, ఎం. నితిన్ తదితరులు పాల్గొన్నారు.





# గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సర్పంచులకు పిలుపు అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే





కరీంనగర్, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గ్రామాలపై పూర్తి అవగాహనతో సర్పంచులు, కార్యదర్శులు సమగ్ర అభివృద్ధి దిశగా కృషి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో పాటు గ్రామాల సొంత ఆదాయ వనరులను పెంచుకోవాలని, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. వీబీజీ--రామ్ జీ పథకం ద్వారా 318 రకాల పనులు చేపట్టే అవకాశం ఉందని, సర్పంచులు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ కె. అనిల్ కుమార్ మాట్లాడుతూ, నిధులు రాగానే అపోహలకు తావివ్వకుండా అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ మాట్లాడుతూ, సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో పవన్ కుమార్, డీఆర్డీఓ గీత, పంచాయతీరాజ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లలో ఎస్సీ విద్యార్థుల దుస్థితి దారుణం - పాలడుగు నాగార్జున





నల్గొండ, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. నోట్‌బుక్స్ పంపిణీ చేయకపోవడం, ఏడు సంవత్సరాలుగా ప్లేట్లు--గ్లాసు లు ఇవ్వకపోవడం, ఫ్యాన్లు లేక ఉక్కపోతలో విద్యార్థులు ఇబ్బంది పడటం, బాత్రూమ్‌లకు కిటి కీలు లేక సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం విద్యార్థులు మూడంతస్తుల వరకు నీటిని మోసుకెళ్లాల్సి వస్తోందని, వాటర్ ఫిల్టర్ చెడిపోయినా మరమ్మతు చేయలేదని తెలిపారు. అర్హులైన విద్యార్థులకు కనీస సౌకర్యాలు అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని మండిపడ్డారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు గాదె నరసింహ, గణేష్, మహేష్, వాసు, నరేష్, శ్రీను, గౌతమ్ పాల్గొన్నారు.

# ఘనంగా ఏబివిపి ఆవిర్భావ దినోత్సవం




దేవరకొండ, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం, 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్ నుంచి జడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ స్కూల్ మైదానం వరకు విద్యార్థులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి ఏబివిపి జెండాను ఆవిష్కరించారు. దేశభక్తి నినాదాలు, విద్యార్థి చైతన్యాన్ని ప్రతిబింబించే నినాదాలతో పట్టణం మార్మోగింది. ఈ సందర్భంగా రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ -- "1949 జూలై 9న ఆవిర్భవించిన ఏబివిపి నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగి కోట్లాది మంది విద్యార్థులను చైతన్యవంతం చేస్తోంది" అని అన్నారు. గత 78 సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య కోసం ఉద్యమాలు, జాతీయ పునర్నిర్మాణం, సామాజిక సేవ, నాయకత్వ వికాసం వంటి రంగాల్లో ఏబివిపి విశేష సేవలు అందిస్తోందని తెలిపారు. "జ్ఞానం -- శీలం -- ఏకత" అనే త్రిసూత్రం ఏబివిపి మార్గదర్శకమని, విద్యార్థి కేవలం ఉద్యోగం కోసం చదివే వ్యక్తి కాకుండా దేశ భవిష్యత్తును నిర్మించే బాధ్యతగల పౌరుడిగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి యలమల హేమ సుందర్, లింగాల రాకేష్, సంతోష్, దమ్మజు అమితేష్, చరణ్, నరేష్, శివ, గణేష్, వినయ్, అబ్దుల్, చేపూరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు రక్షణకు ధర్నా




నల్లగొండ, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు రక్షణకై జూలై 20న జిల్లా కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అవుట రవీందర్ పిలుపునిచ్చారు. గురువారం తాపీ కార్మిక సంఘం సమావేశం సుందరయ్య భవన్లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాటా ్లడుతూ -- అనేక పోరాటాల ఫలితంగా ఏర్పడిన సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. ఒక్క శాతం పన్నుల ద్వారా బోర్డులో ఉన్న నిధులను ఆరోగ్య పరీక్షల పేరుతో జూజ హెల్త్‌కేర్కు అక్రమంగా మళ్లిస్తున్నారని, ప్రమాద మరణాల పరిహారం ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం ద్వారా కార్మికులు నష్టపోతున్నారని తెలిపారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు ?9000 పెన్షన్ ఇవ్వాలని, కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు కల్పిం చాలని, సంక్షేమ బోర్డును బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు ప్రైవేటు ఏజెన్సీలకు ప్రోత్సాహం ఇస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని వారు విమర్శించారు. సంక్షేమ బోర్డు రక్షణకై జూలై 20న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో భవన నిర్మాణ రంగ కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు సలివోజు సైదాచారి, గౌరవాధ్యక్షుడు సాగర్ల మల్లయ్య, కార్యదర్శి జేరిపోతుల యాదయ్య, నాయకులు శ్రీనివాస్, బ్రహ్మయ్య, అన్నం శ్రీను, దామోదర్ రెడ్డి, నేరటి జానయ్య, కొండకింది దామోదర్ రెడ్డి, వల్లపు సైదులు, ఇంద్రకంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్సీ నివేదికను బహిర్గతం చేయాలి టిఎస్ యుటిఎఫ్




తెల్కపల్లి, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):రెండో పిఆర్సీని తక్షణమే అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. యం. శ్రీధర్ శర్మ డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు కె. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ -- జూలై 1, 2023 నుంచి అమలు కావాల్సిన పిఆర్సీని మూడు సంవత్సరాలు గడిచినా అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. మార్కెట్ ధరలకనుగుణంగా మెరుగైన ఫిట్మెంట్‌తో నూతన పే స్కేలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 6 డిఎలను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా 2004 నుంచి అమలులో ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సర్వీసులో ఉన్న టీచర్లను టెట్ నుంచి మినహాయించాలని, విద్యా హక్కు చట్టాన్ని సవరించి పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలంటే పాఠశాలల కుదింపు ఆలోచన మానుకుని కొత్త ఆవాసాల్లో పాఠశాలలు ప్రారంభించాలని, ఉప ముఖ్యమంత్రి హామీ మేరకు ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎం. రమేశ్, కమిటీ సభ్యుడు కె. రమేశ్ పాల్గొన్నారు. వట్టిపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు కె. కళ్యాణ్ ప్రత్యేక చొరవతో విద్యార్థుల సంఖ్య 11 నుంచి 38కి పెంచినందుకు టిఎస్ యుటిఎఫ్ అభినందనలు తెలిపింది. అదనపు ఉపాధ్యాయులను నియమించాలని మండల విద్యాధికారి ని కోరారు.

# ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా



వెల్దండ/అచ్చంపేట, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78వ ఆవిర్భావ దినోత్సవం, జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా వెల్దండ, అచ్చంపేట పట్టణాల్లో ఘనంగా వేడుకలు జరిగాయి. వెల్దండ మండల కేంద్రంలోని కోట మైసమ్మ గుడి ఆవరణలో మండల కన్వీనర్ రేణుకుంట్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో భారతమాత ఫోటోకు పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. ముఖ్య అతిథి నకరకంటి శ్రీనివాస్ మాట్లాడుతూ -- 1949లో ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ నేడు 78 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా నిలిచిందని, దేశ నిరా ్మణంలో ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకుందని అన్నారు. అచ్చంపేట పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి, స్వామి వివేకానంద, భారతమాత పటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జెండా ఆవిష్కరణ జరిగింది. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్యామ్ కిరణ్ మాట్లాడుతూ -- ఏబీవీపీ దేశవ్యాప్తంగా జాతీయవాదాన్ని పెంపొందించిందని, కాశ్మీర్ ఆర్టికల్ 370 రద్దు ఉద్యమం, అక్రమ వలసదారుల వ్యతిరేక పోరాటాల్లో కీలక పాత్ర పోషించిందని అన్నారు. విద్యార్థి నిర్మాణమే జాతీయ నిర్మాణమని, ప్రతి విద్యార్థి ఈ ప్రయాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. వెల్దండ, అచ్చంపేటలో విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని దేశభక్తి నినాదాలతో పట్టణాలను మార్మోగించారు.

# ఎలిగేడులో ఓటుహక్కు ప్రాధాన్యతపై కళాజాత



ఎలిగేడు, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్వో ఆధ్వర్యంలో, రాష్ట్ర చైర్మన్ వెన్నెల గద్దర్ నేతృత్వంలో గురువారం ఎలిగేడు మండల కేంద్రంలో ప్రభుత్వ కళా బృందం నిర్వహించిన కళాజాత ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులు ఓటరుగా నమోదు, ఓటు హక్కు వినియోగం, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలు అందజేస్తారని, ఫోటోతోపాటు ఫారంను నింపి తిరిగి ఇవ్వాలని సూచించారు. "ఓటే వజ్రాయుధం" అనే సందేశాన్ని కళాజాత ద్వారా గ్రామస్థులకు చేరువ చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాజన్న, రవి, మల్లేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తోటపల్లి మాదారం బీటీ రోడ్డు కోసం బిజెపి ధర్నా



కల్వకుర్తి, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కల్వకుర్తి మండలంలో తోటపల్లి--మాదారం బీటీ రోడ్డు నిర్మాణం కోసం గురువారం బిజెపి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. మండల అధ్యక్షుడు మట్టా నరేష్ గౌడ్ మాట్లాడుతూ -- తుర్కపల్లి గేటు నుంచి మాధారం గేటు వరకు 12 కి.మీ. రోడ్డు గత 15 సంవత్సరాలుగా దారుణ స్థితిలో ఉందని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో బిజెపి సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో యాత్ర చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, తుర్కపల్లి గేటు నుంచి తోటపల్లి సబ్‌స్టేషన్ వరకు మాత్రమే నామమాత్రపు పనులు జరిగాయని, ఇంకా ఎనిమిది కి.మీ. రోడ్డు మిగిలి ఉందని పేర్కొన్నారు. వెంటనే పనులు చేపట్టకపోతే ఆందోళనను ఉద్ధృతం చేస్తామని హెచ్చరి ంచారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పసుల లింగారెడ్డి, రమణ గౌడ్, మట్టా సురేష్ గౌడ్, శంకర్ గౌడ్, లడ్డుగౌడ్, పసుల భాస్కర్ రెడ్డి, దీపక్ రెడ్డి, లక్ష్మారెడ్డి, హరి శంకర్ గౌడ్, వరుణ్, కృష్ణ గౌడ్, శ్రీరామ్, రైతు సంఘం నాయకులు బాలకృష్ణయ్య, కంపిళ్ళ భాస్కర్, ప్రయాణికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థి శక్తే దేశ భవిష్యత్తుకు పునాది



### - ఏబీవీపీ నగర కార్యదర్శిగా చెన్నంచెట్టి మల్లేష్ ఎన్నిక

ఆమనగల్లు, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): విద్యార్థి లోకంలో జాతీయ భావజాలం, సేవా దృక్పథాన్ని పెంపొందించడంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కీలక పాత్ర పోషిస్తోందని ఆమనగల్లు నగర కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన చెన్నంచెట్టి మల్లేష్ అన్నారు. గురువారం ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమనగల్లులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఏబీవీపీ పూర్వ నాయకుల సమక్షంలో చెన్నైట్టి మల్లేష్‌ను నగర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకుని ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మల్లేష్ మాట్లాడుతూ 1949 జూలై 9న ఢిల్లీ విశ్వవిద్యాలయంలో స్థాపించబడిన ఏబీవీపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగిందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ నాయకులు శ్రీకాంత్ సింగ్, కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్, వరికిప్పల శ్రీను, పాతకోట శ్రీశైలం, గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యుడు పురుగుల శివ, రాష్ట్ర నాయకులు లండం మల్లేష్, గోరటి భరత్, నరేష్ గౌడ్, ఎడవల్లి అంజి, సుమన్ నాయక్, అఖిల్ నాయక్, శివ చారి, సాయి, చరణ్, గణేష్, రాఘవతో పాటు పలువురు కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

శుక్రవారం,
జూలై 10, 2026

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని నేడు బంద్



కల్వకుర్తి, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు పిలుపునిచ్చారు.సీఐటీయూ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ -- మూడు సంవత్సరాలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని, 27 వేల విద్యాసంస్థలను నాలుగు వేలకు కుదించి పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జూలై 10 బంద్‌కు విద్యావంతులు, మేధావులు, యాజమాన్యాలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రామార్జున్, పట్టణ నాయకులు రవి, శివ, డివైఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారాలపై ప్రజలకు అవగాహన



కల్వకుర్తి, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై గురువారం మాజీ మున్సిపల్ చైర్మన్ ఎద్మ సత్యం ప్రజలకు అవగాహన కల్పించారు.దరఖాస్తు ఫారాలను నింపే విధానాన్ని వివరించి ప్రజలకు అందజేశారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ విలువైన ఓటు హక్కును కోల్పోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ షాహిద్, మాజీ కౌన్సిలర్ సైదులు గౌడ్, నేరేటి శేఖర్ గౌడ్, జమ్ములు శివచారి, సాధిక్, ఇమ్రాన్, కాలనీవాసులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలకు మిత్ర ఫౌండేషన్ బెంచీల వితరణ



కల్వకుర్తి, జూలై 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వం మైనారిటీ గురుకుల కళాశాల ఆవరణలో తల్లిదండ్రుల సౌకర్యార్థం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు.విద్యార్థుల అడ్మిషన్లు, తల్లిదండ్రులు పలకరించే సందర్భాల్లో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ సామాజిక కార్యక్రమంలో భాగంగా బెంచీలను ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు.

# ఎస్ఐఆర్ లో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి

**- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖలీల్**



ఆమనగల్లు, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులోని 186వ పోలింగ్ బూత్‌లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖలీల్ హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైతే సవరణలు చేసుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం సూచించిన గడువులోపు అవసరమైన పత్రాలు సమర్పించి ఓటరు జాబితాలోని వివరాలను సరిచేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఉప సర్పంచ్ చేయూత

**- శెట్టిపల్లి పాఠశాలకు టేబుళ్లు, కుర్చీలు అందజేసిన కృష్ణ ప్రసాద్ గౌడ్**



ఆమనగల్లు, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మండలంలోని శెట్టిపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామ ఉప సర్పంచ్ కృష్ణ ప్రసాద్ గౌడ్ గురువారం తన వంతు సహకారం అందించారు. విద్యార్థుల సౌకర్యార్థం తన సొంత ఖర్చులతో టేబుళ్లు, కుర్చీలు కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జంగమ్మ--వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు మహేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు, యువజన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేయడమే గ్రామ పాలకవర్గం లక్ష్యమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే శెట్టిపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, యువజన సభ్యులు తమకు సాధ్యమైన మేరకు పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందరూ భాగస్వాములై విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని గ్రామ పాలకవర్గం విజ్ఞప్తి చేసింది.

# వేలాది కళ్లకు వెలుగునిస్తున్న సుంకిరెడ్డి సేవా యజ్ఞం

**- తలకొండపల్లి మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన**



తలకొండపల్లి, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ శంకర నేత్రాలయ, చెన్నై వైద్య నిపుణులు తలకొండపల్లిలోని శ్రీ దేవకి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం ప్రజల విశేష ఆదరణతో ఆరవ రోజుకు విజయవంతంగా చేరుకుంది. ఇప్పటివరకు శిబిరాన్ని 5,200 మందికిపైగా సందర్శించగా, 3,170 మందికిపైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 2,038 మందికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేయగా, 180 మందిని కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఇప్పటికే మూడు రోజులుగా నిర్వహించిన శస్త్రచికిత్సల్లో 98 మంది పేషెంట్లకు విజయవంతంగా ఆపరేషన్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక కంటి వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో చికిత్సలకు దూరం కాకుండా శంకర నేత్రాలయ వైద్య బృందంతో అత్యున్నత వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. కంటి చూపు ప్రతి మనిషి జీవితంలో అమూల్యమైనదని, ఒకరికి చూపు తిరిగి రావడం అంటే ఆ కుటుంబానికి కొత్త జీవితాన్ని అందించినట్లేనని పేర్కొన్నారు. రేపటితో ఉచిత కంటి పరీక్షలు ముగియనున్నందున ఇంకా పరీక్షలు చేయించుకోని వారు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. కంటి శుక్లాల శస్త్రచికిత్సలు ఆదివారం వరకు కొనసాగుతాయని తెలిపారు. ఆరవ రోజు ఒక్కరోజే దాదాపు వెయ్యి మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా, 650 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. 430 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేయగా, 38 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. మూడో రోజు కొనసాగిన శస్త్రచికిత్సల్లో మరో 34 మందికి విజయవంతంగా ఆపరేషన్లు నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తిగా ఉచితంగా నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు.

# ప్రతి అర్హుడి ఓటు నమోదు పూర్తి చేయాలి

**- సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్**



ఆమనగల్లు, జూలై 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా అధికారులు, బీఎల్‌ఓలు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని రాంనుంతల గ్రామ సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్ సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం పాత గ్రామపంచాయతీ భవనంలో నిర్వహించిన ఎన్యూమరేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ బీఎల్‌ఓలు, సంబంధిత అధికారులతో కలిసి ఎన్యూమరేషన్ ఫారాల నమోదు విధానం, ఓటర్ల వివరాల సేకరణపై సమీక్ష నిర్వహించారు. గ్రామంలో అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితాకు దూరం కాకుండా ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలు సేకరించి ఫారాలను సక్రమంగా నింపాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకించి కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఓటరుగా నమోదు కావడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ప్రజలు కూడా అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎల్‌ఓ అలివేలు, జీపీఓ రమేష్, ఉప సర్పంచ్ రాజేశ్వరి మోహన్, గ్రామ కార్యదర్శి యాదిగిరి తదితరులు పాల్గొన్నారు.

# రాశిఫలాలు 09 జూలై 2026: ఈరోజు గజకేసరి యోగం ప్రభావంతో మేషం, మిథునం సహా కొన్ని రాశులకు రెండింతల లాభాలు

జ్యోతిష్యశాస్త్రం ప్రకారం గురువారం రోజున చంద్రుడు మేష రాశిలో సంచారం చేయనున్నాడు. ఇదే సమయంలో ద్వాదశ రాశులపై అశ్విని నక్షత్ర ప్రభావం ఉంటుంది. మరోవైపు కుజుడు, చంద్రుడి ప్రభావంతో దురధర యోగం, కర్కాటక రాశిలో గురుడు హంస రాజయోగం, చంద్రుడికి గురుడు నాలుగో స్థానంలో ఉండటం కారణంగా గజకేసరి యోగాలు ఏర్పడనున్నాయి. ఈ శుభ యోగాల కారణంగా మేషం, మిథునం సహా ఈ రాశుల వారికి అత్యంత శుభ ఫలితాలు రానున్నాయి. ఈ సందర్భంగా మేషం నుంచి మీన రాశుల వారికి ఏ మేరకు శుభ ఫలితాలు రానున్నాయి, ఎవరికి అశుభ ఫలితాలు రానున్నాయనే ఆసక్తికరమైన విషయాలను ప్రముఖ పండితులు "ఆచార్య క్రిష్ణ దత్త శర్మ" మాటల్లో తెలుసుకుందాం.




మేష రాశి వారికి ఈరోజు శుభ ఫలితాలు రానున్నాయి. అనేక శుభ యోగాల కారణంగా పనిలో మీ ఉత్సాహం పెరుగుతుంది. మీరు చేసే పనులన్నింట్లో మంచి విజయం సాధించొచ్చు. ఆర్థిక పరంగా మెరుగైన ఫలితాలొచ్చే అవకాశం ఉంది.మీడియా, కళా రంగాలలో పని చేసే వారికి ప్రశంసలు లభించొచ్చు. మీ మాటతీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. వ్యాపారులు తమ ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. మీ వైవాహిక జీవితంలో సంతోషంగా ఉంటుంది.?వృషభ రాశి వారికి ఈరోజు సంతోషకరంగా ఉంటుంది. మీ పనులన్నీ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తవుతాయి. మీ భాగస్వామితో సంతోషంగా గడుపుతారు. మీ కుటుంబ జీవితంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

వ్యాపారులు ఊహించిన మేరకు లాభాలు రావొచ్చు. మీ ఇంట్లో కొన్ని శుభకార్యాలు జరిగే అవకాశం ఉంది. అవివాహితులకు మంచి వివాహ సంబంధాలు రావొచ్చు.

మిథున రాశి నుంచి చంద్రుడు 11వ స్థానంలో సంచారం చేయనున్నాడు. ఈ సమయంలో మీకు ఆర్థిక పరంగా గణనీయమైన ప్రయోజనాలు కలిగే అవకాశం ఉది. ప్రభుత్వ పనులలో పని చేసే వ్యక్తులకు మంచి ఫలితాలు రావొచ్చు. మీ కుటుంబ జీవితంలో సంతోషంగా ఉంటుంది.

ఉద్యోగులకు సహోద్యోగుల నుంచి సహకారం లభిస్తుంది.

# సౌరభ్ గంగూలీకి అరుదైన గౌరవం



భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీకి అరుదైన గౌరవం దక్కింది. అతడికి ప్రతిష్ఠాత్మక ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. బుధవారం గంగూలీ తన 54వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేకమైన రోజునే ఆయనకు ఈ గౌరవం దక్కడం విశేషం. కాగా, స్కాట్లాండ్ వేదికగా జులై 8 నుంచి 11 దాకా ఐసీసీ బోర్డు మీటింగ్ జరగనుంది. ఈ సమావేశం ముగిసిన తర్వాత గంగూలీ పేరును అధికారికంగా హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చనున్నారు. ఈ గౌరవం దక్కడంపై గంగూలీ స్పందించాడు. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు కల్పించడం తనకు దక్కిన గొప్ప గౌరవం అని గంగూలీ అన్నాడు. ఇందుకుగానూ ఐసీసీ బోర్డు, ఐసీసీ ఛైర్మన్ జై షాకు థాంక్స్ చెబుతూ ఎక్స్‌లో ఓ పోస్టు చేశాడు. 'నన్ను హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చినందుకు ఐసీసీ, బోర్డు ఛైర్మన్ జై షాకు ధన్యవాదాలు. ఇది నాకు దక్కిన గొప్ప గౌరవం. ఇప్పటివరకు హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్న భారతీయులలో నేనూ ఒకడిని కావడం, అలాగే గొప్ప వ్యక్తుల పేర్లతో పాటు నా పేరు కూడా చేరడం ఆనందంగా ఉంది' అని గంగూలీ ఎక్స్ పోస్టులో రాసుకొచ్చాడు.

కాగా, ఈ ఘనత దక్కించుకున్న 12వ భారత క్రికెటర్ గంగూలీ. భారత క్రికెట్‌కు గంగూలీ 2000 నుంచి 2005 మధ్య కెప్టెన్సీగా సేవలు అందించారు. ముఖ్యంగా మ్యాచ్-ఫిక్సింగ్ సంక్షోభం తర్వాత జట్టును పునర్నిర్మించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. గంగూలీ 113 టెస్టుల్లో 7,212 పరుగులు, అలాగే 311 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లలో 11,363 పరుగులు సాధించాడు. ఇదిలా ఉండగా, సౌరభ్ గంగూలీ పుట్టినరోజు సందర్భంగా 'దాదా: ది సౌరభ్ గంగూలీ స్టోరీ' బయోపిక్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది ఆ సినీ బృందం. బాలీవుడ్ కథా నాయకుడు రాజ్‌కుమార్ రావ్ ప్రధానపాత్రలో నటిస్తున్నారు. కాగా ఈ చిత్రం వచ్చే ఏడాది మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విక్రమాదిత్య దర్శకత్వం వహిస్తుండగా, లవ్ రంజన్, అంకుర్ గార్గ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా రిలీజ్ చేసింది. గంగూలీ 'జెర్సీ' మూమెంట్‌ను గుర్తుచేస్తున్నట్లున్న ఈ ఫస్ట్‌లుక్‌కు నెటిజన్లు, గంగూలీ అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. నాట్‌వెస్ట్ ట్రోఫీలో భాగంగా 2002లో లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ జట్టుపై భారత్ గెలిచినప్పుడు స్టేడియం బాల్కనీలో ఉన్న గంగూలీ తన జెర్సీని విప్పి చేత్తో తిప్పుతూ సంబరాలు చేసుకున్న దృశ్యాన్ని క్రికెట్ అభిమానులు ఇప్పటికీ మరచిపోలేరు. తాజాగా విడుదలైన ఫస్ట్‌లుక్‌లో రాజ్‌కుమార్ రావ్ ఆ ఐకానిక్ మూమెంట్‌ను రీక్రియేట్ చేశారు. భారత క్రికెట్ చరిత్రలో అత్యంత చిరస్మరణీయమైన జ్ఞాపకంగా క్రీడాభిమానుల మదిలో నిలిచిపోయిన ఈ దృశ్యాన్ని గంగూలీ ఇన్‌స్టాలో పంచుకున్నారు. 'అత్యుత్తమ బహుమతి! మీరు నా కవర్ డ్రైవ్ ఆడడం చూడడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను రాజ్‌కుమార్' అనే క్యాప్షన్ పెట్టారు. యువ క్రికెటర్ నుంచి ఇండియాలో అత్యంత ప్రభావవంతమైన కెప్టెన్‌లో ఒకరిగా ఎదిగిన గంగూలీ ప్రయాణాన్ని ఈ సినిమాలో చూపిస్తున్నట్టు చిత్రవర్గాలు తెలిపాయి.

# వైభవ్ సూర్యవంశీపై భారీ అంచనాలు

## నాలుగో టీ20పై టీమిండియా కసరత్తు



భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టీ20 సిరీస్ ప్రస్తుతం అత్యంత ఉత్కంఠభరితమైన దశకు చేరుకుంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇప్పటికే టీమిండియా 3 మ్యాచ్‌లలో రెండు ఓడిపోగా, ఒక మ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. దీనితో సిరీస్‌లో వెనుకబడిన భారత్, తన సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే బ్రిస్టల్‌లో జరగబోయే నాలుగో టీ20 మ్యాచ్‌లో ఖచ్చితంగా గెలిచి తీరాల్సిందే. ఈ చావో రేవో పోరు జట్టుకే కాకుండా, టీమిండియా యువ ఓపెనర్, యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి కూడా అత్యంత కీలకంగా మారింది. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఆశించిన స్థాయిలో ఆరంభం లభించని వైభవ్, తన మూడో మ్యాచ్‌లోనైనా పాత ఐపీఎల్ హిస్టరీని రిపీట్ చేస్తాడా అనే ఆశతో క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్నారు. భారత జట్టు మేనేజ్‌మెంట్ ఈ ఇంగ్లాండ్ టూర్‌లో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఐర్లాండ్ సిరీస్‌తో పాటు ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లోనూ వరసగా విఫలమైన సీనియర్ ఓపెనర్ సంజూ శాంసన్‌పై వేటు పడింది. యువ హిట్టర్ వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్స్ రావడంతో, రెండో టీ20 మ్యాచ్ ద్వారా అతను అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. అయితే, ఆడిన మొదటి రెండు ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో వైభవ్ వరుసగా 14 పరుగులు, 13 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఈ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అతని బ్యాటింగ్‌లో అగ్రెసివ్ షాట్లు, సిక్సర్లు బాదగల విస్ఫోటక శైలి కనిపించినప్పటికీ, ఆ హిట్టింగ్‌ను పెద్ద ఇన్నింగ్స్‌గా మార్చడంలో అతను విఫలమయ్యాడు. వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడిన మొదటి రెండు మ్యాచ్‌లలో ఫెయిల్ అయినప్పటికీ, క్రికెట్ పండితులు అతనిపై గట్టి నమ్మకంతో ఉన్నారు. దీనికి కారణం అతని ఐపీఎల్ కెరీర్ లోని ఒక అద్భుతమైన సెంటిమెంట్. వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2025 సీజన్ ద్వారా లీగ్‌లోకి అరంగేట్రం చేశాడు. తన మొదటి ఐపీఎల్ మ్యాచ్‌లోనే 20 బంతుల్లో 34 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే, రెండో మ్యాచ్‌లో కేవలం 16 పరుగులకే అవుటయ్యాడు. కానీ, తన కెరీర్‌లోని మూడో ఐపీఎల్ మ్యాచ్‌లో వైభవ్ ఏకంగా విశ్వరూపం చూపించాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఇంటర్నేషనల్ బౌలర్లను ఉతికేస్తూ, కేవలం 34 బంతుల్లోనే శతకం బాదాడు. మొత్తం 38 బంతుల్లో 11 సిక్సర్ల సాయంతో 101 పరుగులు చేసి ప్రపంచ క్రికెట్‌ను ఒక్కసారిగా తనవైపు తిప్పుకున్నాడు. ఐపీఎల్‌లో జరిగినట్లే ఇప్పుడు ఇంటర్నేషనల్ క్రికెట్‌లో కూడా తన మూడో మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేస్తాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. వైభవ్‌కు ఒక అద్భుతమైన రికార్డ్ ఉంది; తన చిన్న కెరీర్‌లోనే జట్టుకు అత్యంత అవసరమైన, ప్రెజర్ ఎక్కువగా ఉండే డూ ఆర్ డై మ్యాచ్‌ల్లోనే అతను ఎప్పుడూ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడు. ఐపీఎల్ అయినా, అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్ అయినా, లేదా ఇటీవలే జరిగిన ఇండియా-ఎ, శ్రీలంక-ఎ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ అయినా.. వైభవ్ ఎల్లప్పుడూ ఒత్తిడిని జయించి గేమ్ ఛేంజర్ ఇన్నింగ్స్‌లు ఆడాడు.

# టాప్ ఆర్డర్‌లోనే సంజూకు అవకాశాలు ఇవ్వాలి

## మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా టీమ్ సూచన

ఇంగ్లాండ్‌తో బ్రిస్టల్ వేదికగా జరగబోయే నాలుగో టీ20 మ్యాచ్‌కు ముందు భారత జట్టు సెలెక్షన్, బ్యాటింగ్ ఆర్డర్‌పై మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటర్ ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పష్టమైన అభిప్రాయాలను పంచుకున్నారు. స్టార్ ప్లేయర్ సంజూ శాంసన్ పట్ల టీమ్ మేనేజ్‌మెంట్ ప్రవర్తిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. జట్టులో మార్పులు చేయాల్సి వస్తే మొదట సంజూ శాంసన్‌నే పక్కన పెట్టడం లేదా బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకు నెట్టడం ఒక అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేఎల్ రాహుల్ విషయంలో కూడా ఇలాగే చేశారని, ఇప్పుడు సంజూను కూడా అదే విధంగా ట్రీట్ చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదని గంభీర్, శ్రేయస్ అయ్యర్ లూప్‌కు ఆకాశ్ చోప్రా సూచించారు. మొదటి టీ20 తర్వాత గత రెండు మ్యాచ్‌లుగా సంజూ శాంసన్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కలేదు. ఓపెనర్లుగా వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మలు బరిలోకి దిగుతుండటంతో సంజూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీనిపై ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. "ఒకవేళ మీరు నాలుగో మ్యాచ్‌లో సంజూను జట్టులోకి తెచ్చినా, ప్రస్తుత బ్యాటింగ్ ఆర్డర్ ప్రకారం అతనిని ఎక్కడ ఆడిస్తారు వైభవ్, అభిషేక్ ఓపెనింగ్ చేసి, ఈషాన్ కిషన్ నెంబర్ 3లో, శ్రేయస్ అయ్యర్ నెంబర్ 4లో వస్తే.. కేవలం కుడిచేతి వాటం బ్యాటర్ కావాలనే కారణంతో సంజూ శాంసన్‌ను



నెంబర్ 5 పొజిషన్‌లో ఆడించడం సరైన నిర్ణయం కాదు. అసలు ఇందులో సంజూ చేసిన తప్పేంటి జట్టులో ఎవరినైనా తీసేయాలంటే మొదట గుర్తొచ్చేది అతనే, అలాగే బ్యాటింగ్ ఆర్డర్ మార్చాలన్నా బలయ్యేది అతనే. నేను ఎప్పుడు సంజూను ఆడించినా మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా ఆడించను, అతని కోసం ఓపెనింగ్ స్థానాన్ని ఖాళీ చేస్తాను. ఎందుకంటే అతను అక్కడే బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇవ్వగలడు" అని స్పష్టం చేశారు. గణాంకాల పరంగా చూసినా సంజూ శాంసన్‌ను టాప్ ఆర్డర్‌లోనే ఆడించాలని ఆకాశ్ చోప్రా గుర్తు చేశారు. సంజూ శాంసన్ తన కెరీర్‌లో ఆడిన 57 టీ20 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లలో కేవలం 10 సార్లు మాత్రమే నెంబర్ 5 లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆ మ్యాచ్‌లలో అతని యావరేజ్ కేవలం 21.13 గా మాత్రమే ఉంది. మొత్తం మీద ఆ పొజిషన్‌లో అతను చేసిన పరుగులు 169 మాత్రమే. దీనిని బట్టి చూస్తే లోయర్ మిడిల్ ఆర్డర్ అనేది సంజూ శాంసన్ శైలికి సరిపోదని, అతనికి ఓపెనింగ్‌లోనే ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని ఆకాశ్ చోప్రా డిమాండ్ చేశారు. ఇదే సమయంలో జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ఫామ్‌పై వస్తున్న విమర్శలను ఆకాశ్ చోప్రా కొట్టిపారేశారు. సంజూ శాంసన్ కోసం తిలక్ వర్మను పక్కన పెట్టాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. "తిలక్ వర్మ మన జట్టుకు వైస్ కెప్టెన్. ఈ సిరీస్‌లో అతని ప్రదర్శన అంత ఘోరంగా ఏమీ లేదు. గత నాలుగు మ్యాచ్‌లను గమనిస్తే అతనికి వచ్చిన అవకాశాలు చాలా తక్కువ. ప్రస్తుతం అతను బ్యాటింగ్ చేస్తున్న పొజిషన్ చాలా కఠినమైనది. అలాంటి స్థానంలో ప్రతి మ్యాచ్‌లోనూ స్థిరంగా రాణించడం ఎవరికైనా కష్టమే. అతని విషయంలో మేనేజ్‌మెంట్ కాస్త ఓపికగా వ్యవహరించాలి. సంజూ శాంసన్‌కు చోటు కల్పించడం కోసం తిలక్ వర్మ స్థానాన్ని మార్చాల్సిన అవసరం లేదు" అని ఆకాశ్ చోప్రా భారత జట్టుకు సలహా ఇచ్చారు.

# స్టోక్స్ రిటైర్మెంట్ వీడియోపై ఐసీసీ సీరియస్



మ్యాచ్ జరుగుతుండగా, డ్రెస్సింగ్ రూమ్‌లో రికార్డు చేసిన వీడియోను రిలీజ్ చేయడం పట్ల ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై వెంటనే వివరణ ఇవ్వాలని ఇంగ్లాండ్, వెల్స్ క్రికెట్ బోర్డును కోరింది. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు జరుగుతుండగా ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఈసీబీ విడుదల చేయడంపై వివాదం చెలరేగింది. అంతర్జాతీయ క్రికెట్‌కు హఠాత్తుగా వీడ్కోలు పలికి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశాడు బెన్ స్టోక్స్ . ట్రెంట్ బ్రిడ్జ్‌లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్ మధ్య మూడో టెస్టు 4వ రోజు బెన్ స్టోక్స్ వీడ్కోలు వార్త బయటకొచ్చింది. ఆ రోజు ఆట మొదలవ్వడానికి ముందే డ్రెస్సింగ్ రూమ్‌లో స్టోక్స్ తనకు కెప్టెన్‌గా, ఆటగాడిగా ఇదే చివరి మ్యాచ్ అని సహచరులకు చెప్పాడు. అతడు తన వీడ్కోలు గురించి వెల్లడిస్తుండగా ఇంగ్లాండ్, వేల్స్ క్రికెట్ బోర్డు మీడియా బృందం ఆ దృశ్యాలను రికార్డు చేసింది. అదేరోజు టీ బ్రేక్ సమయంలో సోషల్ మీడియాలో, టీవీ ఛానెళ్లలో స్టోక్స్ రిటైర్మెంట్ వార్త వెలుగులోకి వచ్చింది. ఇక మ్యాచ్ జరుగుతుండగానే స్టోక్స్ వీడ్కోలు వీడియో బయటకు రావడంపై ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆటగాడు, మ్యాచ్ అధికారులకు సంబంధించిన (పీఎంఓఏ) నిబంధలన ప్రకారం బెన్ స్టోక్స్ ఉల్లంఘనకు పాల్పడ్డాడని, ఈసీబీ కూడా ఇందులో హద్దు మీరిందని ఐసీసీ పేర్కొంది. పీఎంఓఏ నిబంధల ప్రకారం, మ్యాచ్ సమయంలో.. డ్రెస్సింగ్ రూమ్‌లో ఇలాంటివి రికార్డు చేయకూడదు. దీన్ని అతిక్రమణగా తేల్చిన ఐసీసీ.. దీనిపై వివరణ ఇవ్వాలని ఈసీబీకి నోటీసులు పంపింది. మరోవైపు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్.. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు నోటీసులు పంపడంపై బెన్ స్టోక్స్ సెటైర్ వేశాడు. దీనిపై సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. 'అతడిపై వేటు వేయండి' అని ట్వీట్ చేశాడు. ఇక ఈ వివాదంపై ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం.

# మేజర్ లీగ్ క్రికెట్ 2026 సీజన్‌లో సరికొత్త రికార్డు



మేజర్ లీగ్ క్రికెట్ 2026 సీజన్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఆటగాడైన సౌతాఫ్రికా యువ సెన్సేషన్ లూవాన్-డ్రే ప్రిటోరియస్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ తరఫున బరిలోకి దిగిన ఈ 20 ఏళ్ల బ్యాటర్, ఎంఐ న్యూయార్క్‌పై విశ్వరూపం ప్రదర్శించాడు. కేవలం 52 బంతుల్లోనే 10 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి.. మేజర్ లీగ్ క్రికెట్ చరిత్రలోనే శతకం సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. డల్లాస్‌లోని గ్రాండ్ ప్రైరీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ 9 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎంఐ న్యూయార్క్ భీకర బౌలింగ్ ధాటికి పరుగుల వరద పారించలేకపోయింది. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి కేవలం 143 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం క్రీజులోకి వచ్చిన ప్రిటోరియస్ తొలి ఓవర్ నుంచే పరుగుల దాడి చేయడంతో మరో 26 బంతులు మిగిలి ఉండగానే శాన్ ఫ్రాన్సిస్కో అలవోకగా విజయం సాధించింది. భారీ హిట్టింగ్‌తో స్టేడియాన్ని హోరెత్తించిన ఈ మెరుపు ఇన్నింగ్స్ వెనుక ఓ ఇంట్రెస్టింగ్ స్టోరీ ఉంది. ప్రిటోరియస్ ఈ రికార్డు ఇన్నింగ్స్ ఆడింది తన సొంత బ్యాట్‌తో కాదు. తన ఓపెనింగ్ భాగస్వామి ఫిన్ అలెన్ బ్యాట్‌ను అడిగి మరి తీసుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న తర్వాత ప్రిటోరియస్ నవ్వుతూ.. "నేను ఫిన్ అలెన్ బ్యాట్‌తో ఆడాను. నా బ్యాట్‌తో ఆడితే బహుశా ఇన్ని భారీ సిక్సర్లు కొట్టలేకపోయేవాడిని. ఇప్పుడు ఎలాగైనా ఈ బ్యాట్‌ను నా బ్యాగ్‌లో శాశ్వతంగా పెట్టేసుకోవాలి" అని పేర్కొన్నాడు. ఈ అద్భుత విజయంతో శాన్ ఫ్రాన్సిస్కో జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలను పెంచుకుంది. ప్రస్తుత టోర్నమెంట్‌లో ప్రిటోరియస్ వరుస హాఫ్ సెంచరీలతో భీభత్సం సృష్టిస్తున్నాడు. ఇప్పటివరకు 69.16 అద్భుతమైన సగటుతో, 182.01 వేగవంతమైన స్ట్రైక్ రేట్‌తో టోర్నీలోనే అత్యధికంగా 415 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. గతంలో వాషింగ్టన్ ఫ్రీడమ్ ఆటగాడు మిచేల్ ఓవెన్ నెలకొల్పిన అత్యంత పిన్న వయస్కుడి సెంచరీ రికార్డును ప్రిటోరియస్ ఈ మ్యాచ్‌తో బ్రేక్ చేశాడు. అంతకుముందు ఎంఐ న్యూయార్క్ జట్టులో ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ 35 పరుగులు చేయగా.. కెప్టెన్ నికోలస్ పూరన్ 19 పరుగులకే పరిమితమయ్యాడు. శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ తరఫున కెప్టెన్ మాథ్యూ షార్ట్ బాల్‌తో అద్భుతంగా రాణించి మూడు వికెట్లు పడగొట్టాడు. పేసర్లు హరీస్ రవూఫ్, ఆరోన్ హార్డీ చెరో రెండు వికెట్లతో ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశారు.

# రంగారెడ్డి రైజర్స్‌పై కరీంనగర్ డైమండ్స్ ఘన విజయం

టీజీ 20 లీగ్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో రంగారెడ్డి రైజర్స్‌పై కరీంనగర్ డైమండ్స్ ఘన విజయం సాధించి క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో రంగారెడ్డిపై కరీంనగర్ 75 పరుగుల తేడాతో నెగ్గింది. 239 పరుగుల భారీ ఛేదనలో రంగారెడ్డి జట్టు 16.3 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ (63 పరుగులు) హాఫ్ సెంచరీ చేశాడు. చివర్లో నితిన్ సాయి యాదవ్ (50 పరుగులు) పోరాడి ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగాడు. కరీంనగర్ బౌలర్లలో ఆశిశ్ శ్రీవాత్సవ్ 5 వికెట్లతో చెలరేగగా, శుభమ్ శర్మ 2, దినేశ్, నారాయణ్ తేజ, సతీశ్ కుమార్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ ఛేదనలో రంగారెడ్డి తొలి నుంచే వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ అరోన్ జార్జ్ (12 పరుగులు), అలంక్రిత్ రాపోల్ (2), ఆదిత్య జివ్వాలి (17 పరుగులు), జ్ఞాన రెడ్డి (1), వెంకట్ కార్తిక్ (1) స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు చేరారు. అయితే మరోవైపు, ఇంకో ఓపెనర్ తనయ్ త్యాగరాజన్ (63 పరుగులు, 33 బంతుల్లో) మెరుపులు మెరిపించడంతో రంగారెడ్డి పోటీలోనే ఉంది. 7.2 ఓవర్లకు 75-5తో పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయింది. దీంతో రంగారెడ్డి ఓటమి చాలాసేపు ముందే ఖరారైంది. అయితే తనయ్, నితిన్ పోరాటంతో ఎక్కడో ఆశలు చిగురించాయి. కానీ 11.2 ఓవర్ వద్ద తనయ్‌ను శుభమ్ ఔట్ చేశారు. తనయ్, నితిన్ కాసేపు వికెట్ల పతనాన్ని ఆపారు. 24 బంతుల్లో 48 పరుగులు జోడించారు. కానీ తనయ్ ఔటైన తర్వాత రంగారెడ్డి వికెట్ల పతనం మళ్లీ షురూ అయ్యింది. ఓవైపు నితిన్ పోరాడినా అది ఓటమి అంతరాన్ని తగ్గించిందేగానీ మ్యాచ్ ఫలితంపై ప్రభావం చూపించలేదు. శ్రీవాత్సవ్ 5 వికెట్లతో సత్తా చాటాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కరీంనగర్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. తన్మయ్



అగర్వాల్ (137 పరుగులు, 61 బంతుల్లో, 11 ఫోర్లు, 10 సిక్స్‌లు) భారీ సెంచరీతో చెలరేగాడు. హెచ్ కే సింబ (50 పరుగులు, 28 బంతుల్లో) హాఫ్ సెంచరీతో రాణించాడు. దీంతో డైమండ్స్ జట్టుకు భారీ స్కోర్ దక్కింది. రంగారెడ్డి బౌలర్లలో కరియప్ప 2, అరుణ్ కుమార్, తనయ్ త్యాగరాజన్, బింద్రాక్య, నితిన్ యాదవ్ తలో 1 వికెట్ పడగొట్టారు. తాజా విజయంతో కరీంనగర్ జట్టు క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లింది. ఓడిన రంగారెడ్డి రైజర్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక ఇవాళ హైదరాబాద్-ఖమ్మం జట్ల మధ్య జరగనున్న తొలి క్వాలిఫయర్‌లో ఓడిన జట్టుతో కరీంనగర్ పోటీ పడాల్సి ఉంటుంది. ఈ రెండో క్వాలిఫయర్ శుక్రవారం ఉప్పల్ వేదికగానే జరగనుంది.

# వర్షంలో 12 గంటలపాటు ఏకబిగిన చిరు షూటింగ్

## మైసా కోసం అండర్ వాటర్‌లో రష్మిక సాహసం



ప్రేక్షకులను అలరించడం కోసం నటీనటులు ఎంత కష్టాన్నైనా భరిస్తారు. పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకుంటారు. ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో చిరంజీవి హీరోగా రానున్న మెగా 158 ఒకటైతే.. రష్మిక ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'మైసా' మరొకటి. ఈ చిత్రాల కోసం అటు చిరు.. ఇటు రష్మిక ఎంతో కష్టపడుతున్నారు. తాజాగా ఈ రెండు సినిమాల అప్‌డేట్స్‌ను ఆయా చిత్రబృందాలు పంచుకున్నాయి. మెగా 158లో వర్షంలో సీక్వెన్స్ కోసం చిరంజీవి 12 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేయగా.. 'మైసా' కోసం రష్మిక అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో మెగా158 (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఉదయం 4 గంటలకు వ్యాయామంతో తన రోజును ప్రారంభించే చిరంజీవి నిబద్ధత చూసి మా చిత్రబృందం ఆశ్చర్యపోయింది. అత్యంత కఠినమైన యాక్షన్ సన్నివేశాలను షూట్ చేయడం కోసం 12 గంటలు పట్టింది. వర్షంలో ఉండే ఈ సన్నివేశాన్ని చిరు ఎంతో కష్టపడి పూర్తి చేశారు. అందుకే ఆయన మెగాస్టార్ అయ్యారు అని టీమ్ పోస్ట్ చేసింది.'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె.. గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. తాజాగా అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. సినిమాలో ఈ సన్నివేశం చాలా ఆసక్తిగా ఉంటుందని టీమ్ వెల్లడించింది. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందారు.

# మరో సస్పెన్స్ థ్రిల్లర్... వదల




సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదల' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను గమనిస్తే, మొదట ఒక సాధారణ కుటుంబ కథలా సినిమా ప్రారంభమవుతుంది. ఇరవై ఏళ్లుగా సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులుగా జగపతిబాబు, లయ కనిపిస్తారు. ఒకరిపై ఒకరికి అపారమైన ప్రేమ, ఆప్యాయతతో జీవిస్తున్న వారి జీవితంలోకి అనూహ్యంగా ఓ యువతి ప్రవేశించడం కథను పూర్తిగా మలుపుతిప్పుతుంది. పక్కింటికి వచ్చిన ఆ యువతి జగపతిబాబు పాత్రపై ప్రమాదకరమైన స్థాయిలో మోజు పెంచుకోవడం, క్రమంగా అది వ్యామోహంగా మారడం ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. అదే సమయంలో లయ పాత్రకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం, కుటుంబంపై ముప్పు పెరగడం కథలోని సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది. లయ కూడా సహజమైన నటనతో కుటుంబ భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. మరోవైపు హృతిక శ్రీనివాస్ పోషించిన పాత్ర ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె హావభావాలు, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ మరోసారి థ్రిల్లర్ జానర్‌పై తన పట్టు చూపించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కథలో ఎక్కడా సస్పెన్స్ తగ్గకుండా, అదే సమయంలో కుటుంబ భావోద్వేగాలను కూడా సమతుల్యంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ యువతి అసలు ఉద్దేశం ఏమిటి? ఆమె జగపతిబాబు జీవితంలోకి ఎందుకు వచ్చింది? ఈ సంఘటనల వెనుక అసలు నిజం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తిని ట్రైలర్ చివరి వరకు కొనసాగిస్తుంది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్ థ్రిల్లర్ మూడ్‌ను మరింత బలపరిచాయి. డార్క్ టోన్స్, విజువల్ ఫ్రేమింగ్ కథలోని ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు కార్తీక్ కోడకండ్ల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశానికి అదనపు థ్రిల్‌ను జోడించింది.

-----



# సింపుల్ శారీలో కయాదు స్టన్నింగ్ లుక్

నటి, మోడల్ కయాదు లోహార్ తన సహజమైన అందం, అమాయకమైన చిరునవ్వుతో యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటోంది. 'ఏం అందంరా బాబు.. సింపుల్‌గా చూసినా మతిపోతోంది' అనేలా కయాదు తాజాగా దిగిన ఫోటోషూట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. జూలై 10న విడుదల కాబోతున్న తన కొత్త సినిమా ప్రమోషన్స్ కోసం ఈ బ్యూటీ ధరించిన మోడ్రన్ స్కై బ్లూ డ్రెస్ ఫ్యాన్స్ గుండెల్లో మంటలు రేపుతోంది. ట్రెడిషనల్ శారీ లుక్‌కు మోడ్రన్ టచ్ ఇస్తూ కయాదు చేసిన ఈ గ్లామర్ విందు ప్రస్తుతం సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఆ వివరాలు చూద్దాం. స్కై-బ్లూ లుక్‌లో మెరిసిపోయిన కయాదు: ప్రముఖ డిజైనర్ బ్రాండ్ 'జెనోరా అఫీషియల్' రూపొందించిన కస్టమ్ మేడ్ స్కై-బ్లూ కలర్ మోడ్రన్ డ్రేప్ శారీ లుక్‌లో కయాదు లోహార్ దేవకన్యలా మెరిసిపోయింది. లాంగ్ స్లీవ్స్ ఉన్న మెష్ షీర్ బ్లౌజ్, దానికి మ్యాచింగ్‌గా ఉన్న ఫ్లోర్ లెంత్ డ్రెప్డ్ స్కర్ట్ స్టైల్ శారీలో ఈ చిన్నది స్టన్నింగ్ పోజులు ఇచ్చింది. ఇక స్టైలిస్ట్ ఇనాజ్ ఫర్హాన్ ఆధ్వర్యంలో అట్రాంగి డిజైన్స్ జ్యువెలరీ పెట్టుకుని కయాదు చేసిన ఈ ఫోటోషూట్ చూసి కుర్రకారు అవాక్కవుతున్నారు.అందాల ముద్దుగుమ్మ కయాదు లోహార్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం కలబోసిన ఈ బ్యూటీ మొదట మోడలింగ్‌లో రాణించింది. ఆ తర్వాత కన్నడ చిత్రం 'ముగిల్‌పేట్'తో హీరోయిన్‌గా వెండితెరకు ఎంట్రీ ఇచ్చింది. ఇక మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకున్న ఈ చిన్నది, ఆ తర్వాత తెలుగులో 'అల్లూరి' సినిమాలో నటించి మెప్పించింది. ఇక 'డ్రాగన్' మూవీతో యూత్ లేటెస్ట్ క్రష్‌గా మారిపోయింది. 'హృదయం మురళి' ప్రమోషన్స్ హడావిడి: అథర్వా మురళి హీరోగా నటిస్తున్న 'ఇదయం మురళి' (తెలుగులో 'హృదయం మురళి') సినిమాలో కయాదు లోహార్ ప్రధాన కథానాయికగా నటించింది. ఈ సినిమాలో మరో హీరోయిన్‌గా ప్రీతి ముఖుందన్ నటిస్తుండగా, నిహారిక ఎన్ఎమ్ కీలక పాత్రలో కనిపిస్తోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగానే కయాదు ఈ రేంజ్‌లో గ్లామర్ తడాఖా చూపించి సినిమాపై అందరిలోనూ ఆసక్తిని పెంచేసింది. జూలై 10న గ్రాండ్ రిలీజ్: మంచి అంచనాలు ఉన్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ముఖ్యంగా తెలుగులో ఈ చిత్రాన్ని టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ 'మైత్రీ మూవీ మేకర్స్' విడుదల చేస్తుండటంతో సినిమాపై మంచి హైప్ క్రియేట్ అయ్యింది. ఘాశ్రీంశీ =ఘుం - సెన్సార్ బోర్డ్ ఇబ్బందుల్లో సినిమాలు! ఎలాంటి లుక్‌లో ఉన్నా తన సహజమైన నవ్వుతో, అందంతో మాయ చేయడం కయాదు లోహార్‌కే చెల్లింది. ఈ సింపుల్ అండ్ స్టైలిష్ స్కై-బ్లూ లుక్‌తో తనేంటో మరోసారి ప్రూవ్ చేసుకుంది. జూలై 10న రాబోతున్న 'హృదయం మురళి' సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో మరియు కయాదుకు ఎలాంటి బ్రేక్ ఇస్తుందో చూడాలి!

# జన నాయగన్ విడుదలకు సిద్ధం



విజయ్ 'జన నాయగన్' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.


-----

# అఖిల్ ఈసారి హిట్ పక్కా అంటున్న ఫ్యాన్స్!



అఖిల్ తన కెరియర్ ను మొదలుపెట్టి చాలాకాలమే అయింది. అయితే అఖిల్ పై అభిమానులు పెట్టుకున్న అంచలనాలను గత సినిమాలు అందుకోలేకపోయాయి. అఖిల్ మంచి అందగాడు. డాన్స్ .. ఫైట్స్ లోను అఖిల్ కి వంక బెట్టడానికి లేదు. నటన పరంగా కూడా మంచి మార్కులే సంపాదించుకున్నాడు. అయితే అఖిల్ కి తగిన హిట్ మాత్రం ఇంకా ఆయనను వరించలేదనే చెప్పాలి. ఆ సమయం కోసమే ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అఖిల్ చేసిన సినిమానే 'లెనిన్'. సూర్యదేవర నాగవంశీ - నాగార్జున కలిసి నిర్మించిన సినిమా ఇది. మురళీ కిశోర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, రేపు థియేటర్లకు రానుంది. ఈ సినిమా నుంచి వదిలిన సాంగ్స్ కీ .. ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అఖిల్ - భాగ్యశ్రీ బోర్సే జోడీ మార్కులు కొట్టేసింది. ఇంతవరకూ అఖిల్ చేసిన పాత్రలకు పూర్తి డిఫరెంట్ గా ఉండే పాత్ర కావడం, ఈ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. రామాపురం - భారతం మిట్ట అనే రెండు గ్రామాల మధ్య నడిచే కథ ఇది. ఆ గ్రామాలకు చెందిన ఇద్దరు ప్రేమికుల చుట్టూ పరిగెత్తే కథ ఇది. గ్రామీణ రాజకీయాలు .. అక్కడ ప్రతి ఏడాది జరిగే జాతర ప్రధానంగా ఈ కథ కొనసాగుతుంది. లవ్ .. యాక్షన్ .. ఎమోషన్స్ ఈ కథలో బలంగా కనిపిస్తున్నాయి. విలేజ్ బ్యాక్ గ్రౌండ్ లో గతంలో నాగార్జున చేసిన సినిమాలు భారీ విజయాలను అందుకున్నాయి. అలాగే అఖిల్ కి కూడా ఈ సినిమా భారీ విజయాన్ని సాధించి పెడుతుందనేది ఫ్యాన్స్ బలంగా చెబుతున్న మాట.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసిన పెద్ది




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'పెద్ది' నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, థియేటర్ వెర్షన్ కంటే ఓటీటీలో కొన్ని సీన్స్ యాడ్ చేశారు. రన్‌టైం కారణంగా కట్ చేసిన సన్నివేశాలను, థియేటర్‌లో విడుదలైయ్యాక తొలగించిన సీన్స్‌ను కూడా ఇందులో యాడ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో అభిమానులు ఖుష్ అవుతున్నారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి వచ్చింది. కథేంటంటే.. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా.. ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు లేదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగిన వాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేస్తాడు. పేరుకి కూలీ అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటాయి. ఆరు బంతులకు ఆరు సిక్సర్లు కొట్టగలిగిన మొనగాడైన పెద్దిని అంతా ఆట కూలీ అని పిలుస్తుంటారు. అలాంటి పెద్ది క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సి వచ్చింది? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు?తన గ్రామం కోసం పెద్ది ఏం చేశాడు? అన్నదే సినిమా కథ.